మున్సిపాలిటీలో 'ట్రిబుల్ ఆర్'

- నేటి నుంచి మిర్యాలగూడలో 'మేరీలైఫ్.. మేరా సచ్ఛ షెహర్' ప్రారంభం
- వినియోగించని వస్తువుల సేకరణకు కేంద్రాల ఏర్పాటు
- కేంద్ర, రాష్ట్ర స్థాయిలో అవార్డులు సాధించేలా కసరత్తు



మిర్యాలగూడ టౌన్ : నగరాలు, పట్టణాల్లో స్వచ్ఛత కోసం కేంద్ర ప్రభుత్వం 'మేరీ లైఫ్.. మేరీ స్వచ్ఛ షెహర్' పథకాన్ని ప్రవేశపెట్టింది. నేటి నుంచి జూన్ 5వరకు మిర్యాలగూడ మున్సిపాలిటీలో ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు. రీయూజ్ (మళ్లీ ఉపయోగించడం), రీసైకిల్ (మళ్లీ ఉత్పత్తి చేయడం).. రెడ్యూస్(తగ్గించడం) విధానంతో వార్డుల్లో ట్రిబుల్ ఆర్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. పారిశుద్ధ్య పనుల నిర్వహణ మెరుగుపరిచేందుకు కేంద్రం ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షన్ పేరుతో ప్రతి ఏటా పోటీలను నిర్వహిస్తుంది. ఇందులో భాగంగా స్వచ్ఛ సర్వేక్షన్ -2023లో ×మేరీ లైఫ్.. మేరా స్వచ్ఛ షెహర్₹ పేరుతో ఇళ్ల నుంచి వెలువడే చెత్తను తగ్గించేందుకు ట్రిపుల్ ఆర్ విధానాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్నారు.

సేకరించే వస్తువులు..

మున్సిపాలిటీలోని వార్డుల్లో ఇళ్లల్లో నిరుపయోగంగా ఉన్న ప్లాస్టిక్ డబ్బాలు, రేకులు, పుస్తకాలు, పేపర్లు, దుస్తులు, చెప్పులు, షూలు తదితర పొడి చెత్తను సేకరించి ట్రిపుల్ ఆర్ కేంద్రాలకు తరలించనున్నారు. ఈ విధానంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు మున్సిపల్ అధికారులు, పాలక మండలి ప్రత్యేక దృష్టిని సారించాయి. కాగా ప్రస్తుతం బంగారుగడ్డ, ముత్తిరెడ్డికుంట, చైతన్యనగర్, తాళ్లగడ్డ, ప్రకాశ్‌నగర్, సంతోష్‌నగర్, ఇందిరమ్మ కాలనీ లే అవుట్-1, డంపింగ్ యార్డు, మున్సిపల్ కార్యాలయం వీటిని ప్రస్తుతం సైట్‌లో ఆన్‌లైన్ చేయగా మరో 37 కేంద్రాలను ప్రతి వార్డులో మున్సిపల్ అధికారులు గుర్తించనున్నారు. మెప్మా ఆర్పీలు లేదా స్వయం సహాయ సంఘాల సభ్యులు ప్రతి రోజూ ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు వీటి నిర్వహణ బాధ్యతలు చూస్తారు.

ట్రిబుల్ ఆర్‌కు అవార్డులు..

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు మున్సిపల్ చైర్మన్ తిరుగనగర్ భార్గవ్, మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్‌లు దీనిపై పూర్తి స్థాయిలో చర్చించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు కార్యాచరణ రూపొందించారు. ట్రిపుల్ ఆర్ పోటీలకు తలబడుతున్న మున్సిపాలిటీలకు కేంద్రం అవార్డులను ఇవ్వనున్నది. ఎక్కువ చెత్త సేకరించిన కేంద్రాల నిర్వాహకులను గుర్తించి వచ్చే నెల 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా అవార్డులను ప్రదానం చేయనున్నారు. ఈ పోటీలకు మిర్యాలగూడ మున్సిపాలిటీ పోటీపడుతుంది.

ప్రజలకు అవగాహన కల్పిస్తాం



'మేరీ లైఫ్.. మేరా స్వచ్ఛ షెహార్' కార్యక్రమంలో వార్డుల్లో మహిళా సంఘాల ద్వారా అవగాహన కల్పిస్తాం. ట్రిబుల్ ఆర్ కేంద్రాలను ఇప్పటికే వార్డుల్లో గుర్తించి ఏర్పాటు చేస్తున్నాం. ఉపయోగపడని పాత వస్తువులు ఈ కేంద్రాల్లో అప్పగించాలి. దీనిపై ప్రజలకు మరింత అవగాహన కల్పించేలా చూస్తాం.

- తిరునగరు భార్గవ్, మున్సిపల్ చైర్మన్ మిర్యాలగూడ

వార్డు ఆఫీసర్లను నియమించాం



మున్సిపాలిటీలో నేటి నుంచి ట్రిపుల్ ఆర్ కార్యక్రమంలో ప్రజలు, మహిళా సంఘాలకు శిక్షణ ఇవ్వనున్నాం. 48 వార్డులకు గాను 48 మంది వార్డు ఆఫీసర్లను నియమించాం. మెప్మా ఆధ్వర్యంలో తడి, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియను నిర్వహిస్తాం. పొడి చెత్తను ట్రిబుల్ ఆర్ కేంద్రాలకు తరలించడంతో పాటు రికార్డు చేస్తాం.

- రవీందర్‌సాగర్, మున్సిపల్ కమిషనర్, మిర్యాలగూడ

చందంపేట, నేరెడుగొమ్ము మండలాలకు సాగునీరు

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్



చందంపేట : కాల్వ ద్వారా నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

చందంపేట : డిండి ప్రాజెక్టు నుంచి చందంపేట, నేరెడుగొమ్ము మండలాలకు కాల్వల ద్వారా సాగునీరు అందిస్తున్నట్లు దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం డిండి ప్రాజెక్టు నుంచి చందంపేట, నేరెడుగొమ్ము మండలాలకు కాల్వల ద్వారా ఎమ్మెల్యే నీటిని వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందంపేట, నేరెడుగొమ్ము మండలాల్లో వారం రోజుల్లో 25 కుంటలు, చెరువులను నింపేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నిజాం కాలం నాటి కాల్వలకు మరమ్మతులు చేయడంతో పాటు మే నెలలో చెరువులు, కుంటలు నింపుతున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరాం, జెడ్పీటీసీ కేతావత్ బాలు, ముత్యాల సర్వయ్య, గోసుల అనంతగిరి, రమావత్ మోహన్ కృష్ణ, పల్స వెంకటయ్య, జక్కుల మున్నయ్య, బైరెడ్డి కొండల్‌రెడ్డి, పాషా, బొడ్డుపల్లి కృష్ణ, శోభన్, సైదులు, అధికారులు పాల్గొన్నారు.

బీజేపోళ్లకు అభివృద్ధి కనిపించడం లేదు

దేవరకొండ : దేవరకొండ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి బీజేపీ నాయకులకు కనిపించడ లేదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ విమర్శించారు. సోమవారం దేవరకొండలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసి విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర మంత్రి మహేంద్రనాథ్ పాండే పగటి పూట వచ్చి చూస్తే నియోజకవర్గంలో ప్రాజెక్టు పనులు, అభివృద్ధి కనిపించలేదన్నారు. బీజేపీ కేంద్రంలో అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్ల గడుస్తున్నా కృష్ణా జలాల వాటా నేటికీ తేల్చలేదన్నారు. నియోజకవర్గంలో నక్కలగండి ప్రాజెక్టు పనులు 90శాతం వరకు పూర్తయ్యాయని ఆయన తెలిపారు. సింగరాజుపల్లి, గొట్టిముక్కల రిజర్వాయర్ నిర్మాణ పనులు 95శాతం పూర్తయినట్లు ఆయన పేర్కొన్నారు. దేవరకొండ నియోజకవర్గం అన్ని విధాలుగా అభివృద్ధిలో ముందుకెళ్తుందన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ కేతావత్ బాలూనాయక్, టీవీఎన్ రెడ్డి, వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, రాజినేని వెంకటేశ్వర్‌రావు, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, రహత్‌అలీ, వేముల రాజు, ఆరెకంటి రాములు, పల్స వెంకటయ్య, కొండల్‌రెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ, తదితరులున్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

చింతపల్లి : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని వర్కాల గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కంకణాల ప్రవీణ, గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, గోపిడి కష్ణారెడ్డి, రవి, అక్రమ్, మాస భాస్కర్, ప్రసాద్, శ్రీశైలం, ఆంజనేయులు, ఖాలెద్ పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన సాయిమందిరం



సాయినాథుడికి అభిషేకం చేస్తున్న పూజారులు

చింతపల్లి : హైదరాబాద్-నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై మండల కేంద్రంలో కొలువుదీరిన సాయి మందిరం 16వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం భక్తులతో కిటకిటలాడింది. చండీ ఉపాసకులు బ్రహ్మశ్రీ వడ్లకొండ్ల రామశర్మ ఆధ్వర్యంలో సాయినాథుడికి ప్రత్యేక అభిషేక, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహా పూర్ణాహుతి, సాయినాథుడికి దత్తాత్రేయ, విఘ్నేశ్వర, సరస్వతీ, కాశీ విశ్వేశ్వర స్వామి విగ్రహాలకు ఏకాదశ రుద్రసాహితీ అష్టోత్తర కళాభిషేకం, మహా మంత్ర పుష్పం, తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. కోలాట బృంద ప్రదర్శన, స్వామి వారి పల్లకి సేవా ఊరేగింపు కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, ఒంగోలు, నెల్లూరు, మాచర్ల, సూర్యాపేట, తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనుంజయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, ఊరె కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ : హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా జూన్ 2న రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎన్ఎస్‌యూఐ మహమ్మద్ ఆరీఫ్ తెలిపారు. సోమవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో క్విజ్ పోటీల పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. క్విజ్‌లో పాల్గొనే వారు 7661899899కు మిస్డ్‌కాల్ ఇచ్చి పేరు నమోదు చేసుకోవాలన్నారు. పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి ల్యాప్‌టాప్, రెండో బహుమతి స్మార్ట్‌ఫోన్, మూడో బహుమతి టాబ్లెట్ ఫోన్, ప్రతి నియోజకవర్గంలోని మహిళ టాపర్‌కు ఎలక్ట్రిక్ స్కూటర్‌ను బహుమతిగా అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ నాయకులు ఇంద్ర, నవీన్, సురేష్, సోహెల్, ఇమ్రాన్, అజయ్, కిరణ్, తరుణ్, పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : దేవాలయాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని లావూడితండాలో సోమవారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ లింగ బసవేశ్వర స్వామి, ఆంజనేయస్వామి వారి నూతన ఆలయ, విగ్రహ, శిఖర, నూతన ఏకశిల, ధ్వజ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డితో కలిసి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొల్కలకాల్వ గ్రామంలో గంగమ్మతల్లి జాతరలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. పండుగలు, జాతరలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ ధనావత్ చిట్టిబాబునాయక్, పీఏసీఎస్ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు మట్టపల్లి సైదులుయాదవ్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు గడగోజు ఏడుకొండలు, సర్పంచ్ బోగబోయిన రాజు, నాయకులు అంగోతు హాతీరాంనాయక్, రవితేజ, సాయన్న, షోయబ్, శ్రీహరి, శ్రీనివాస్, యాదగిరి, పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మ గౌరవానికి వందేళ్లు



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు

మిర్యాలగూడ టౌన్ : తెలుగు వారి ఆత్మ గౌరవానికి వందేళ్లు పూర్తయ్యాయని టీడీపీ జాతీయక్రమశిక్షణ కమిటీ సభ్యుడు, నల్లగొండ పార్లమెంటు పరిశీలకులు బంటు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జక్కలి ఐలయ్య, తుమ్మల మధుసూధన్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీమన్నారయణ ఫంక్షన్ హాల్‌లో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు శతజయంతి ఉత్సవాల సందర్భంగా పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి మినీ మహానాడు నిర్వహించారు. ఈసందర్భంగా వారు ముఖ్య అతిథిగా హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. అలాగే పలు అంశాలపై తీర్మానం చేశారు. పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలని, ఎన్టీఆర్‌కు భారత రత్న ఇవ్వాలని, తెలంగాణ పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయాలని ఇలా తదితరల అంశాలపై ప్రవేశపెట్టిన తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు పొగాకు జయరాం, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముత్తవరపు సైదేశ్వర్‌రావు, ఎల్‌వి యాదవ్, రాంరెడ్డి, ఓరుగంటి ప్రభాకర్, మండవ వెంకటేశ్వర్‌రావు, వడ్డెబోయిన శ్రీనివాస్, కృష్ణయ్య, రసూల్, రవీందర్‌రెడ్డి తదితరులున్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి



దేవరకొండ : ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

దేవరకొండ : ఫర్టిలైజర్ దుకాణాదారులు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ టీం ఏడీఏ ఇందుమతి అన్నారు. దేవరకొండ పట్టణంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను సోమవారం రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ టీం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా ఆయా దుకాణాల్లో ఉన్న విత్తనాల ప్యాకెట్లు వాటి ఇన్‌వాయిస్‌లను, ఎరువుల బస్తాలు వాటి బ్యాచ్ నంబర్లు వంటి వాటిని క్షుణ్ణంగా పరిశీలించారు.ఈ సందర్భంగా దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్లు, స్టాక్‌బోర్డులు పరిశీలించి దుకాణ యజమానులకు పలు సూచనలిచ్చారు. విత్తన నమూనాలు సేకరించి అక్కడికక్కడే పరీక్షలు నిర్వహించారు. తనిఖీల్లో సీఐ నాగరాజు, సౌజన్య, దేవరకొండ ఏడీఏ వీరప్ప, ఏఓ రవి పాల్గొన్నారు.

అడవిదేవులపల్లి : మండల కేంద్రంలో ఫర్టిలైజర్ షాపులను టాస్క్‌ఫోర్స్ బృందం ఆకస్మికంగా సోమవారం తనిఖీ చేసింది. అనంతరం ఫర్టిలైజర్ షాప్‌లో స్టాకర్ రికార్డలను పరిశీలించారు. ఈసందర్భంగా టాస్క్‌ఫోర్స్ సభ్యులు, ఎస్ఐ హరిబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అర్చన, ఏఈఓలు నరేష్, కె. మహేష్‌నాయక్, డీలర్లు కృష్ణ, కోటి, వెంకటనారాయణ, బాలకోటి, పేర్ల లింగయ్య, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

షాపులను తొలగించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి

హాలియా : మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు అంగడి బజార్‌లో ఉన్న 66 ఫీట్ల రోడ్డును ఆక్రమించి రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసుకున్న షాపులను వెంటనే తొలగించాలని మున్సిపల్ బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ వర్ర వెంకట్‌రెడ్డి సోమవారం మున్సిపల్ కమిషనర్ కందిమళ్ల వీరారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీ లోని అంగడీ బజార్‌లో 66 ఫీట్ల రోడ్డును కొందరు ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపట్టారని, వాహనదారులు ఆ బజార్ గుండా వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. షాపుల యాజమానులకు పలు మార్లు నోటీసులు కూడా ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా సంధ్య



మిర్యాలగూడ టౌన్ : భట్రాజుల సంక్షేమ సంఘం జిల్లా మహిళా అధ్యక్షురాలిగా మిర్యాలగూడ పట్టణానికి చెందిన నక్క సంధ్య ఏకగ్రీవంగా ఎన్నికైంది. నల్లగొండ జిల్లా భట్రాజుల సంక్షేమ సంఘం సమావేశం పట్టణంలో ఆదివారం రాత్రి నిర్వహించిన సమావేశంలో ఆమెను కగ్రీవంగా ఎనుకున్నారు. ఈ సందర్భంగా తన నియామకానికి అన్ని విధాలుగా సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సరాజు, ప్రధాన కార్యదర్శి సరస్వతి, శంకర్‌రాజు, గౌరవ అధ్యక్షులు సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక అధ్యక్షులు పిచ్చంరాజు, కోశాధికారి శ్రీనివాసరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు సరికొండ రామకృష్ణం రాజులు పాల్గొన్నారు.

దళితుల అభ్యున్నతికి భాగ్యరెడ్డివర్మ కృషి



మిర్యాలగూడ అర్బన్ : భాగ్యరెడ్డివర్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ, తదితరులు

మిర్యాలగూడ అర్బన్ : దళితుల అభ్యున్నతికి కృషి చేసిన దివంగత భాగ్యరెడ్డి వర్మ జయంతిని సోమవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జి.జ్యోతిలక్ష్మి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ టి.వీరారెడ్డి, కార్యాలయ పర్యవేక్షకులు పి.కరుణాకర్ రావు తో పాటు ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నాగార్జునసాగర్ : ప్రముఖ దళిత సాహితీవేత్త భాగ్యరెడ్డివర్మ జయంతిని నందికొండ మున్సిపాలిటీ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లక్పతి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపురారం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సంఘ సంస్కర్త భాగ్యారెడ్డి వర్మ జయంతి వేడుకను అధికారులు, ప్రజా ప్రతినిధులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భాగ్యారెడ్డి వర్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనుముల పాండమ్మ, ఎంపీడీఓ అలివేలు మంగమ్మ, ఎంపీఓ బిక్షం రాజ్, సీనియర్ అసిస్టెంట్ తాటి శ్రీనివాస్ పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న జప్తివీరప్పగూడెం గ్రామస్తులు

మిర్యాలగూడ : తాగునీటిని సరఫరా చేసి తమ దాహార్తిని తీర్చాలని కోరుతూ సోమవారం జప్తివీరప్పగూడెం గ్రామస్తులు పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నెల రోజుల నుంచి తాగునీరు సరిగా రాకపోవడంతో నానా అవస్థలు పడుతున్నామని వాపోయారు. వేసవికాలంలో తమ గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, తామే కాకుండా మూగజీవాలు సైతం ఇబ్బందులు పడుతున్నాయన్నారు. గ్రామంలో విద్యుత్ మోటారు, ట్యాంకర్ అందుబాటులో ఉన్నప్పటికీ అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపంతో పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను 24గంటలలోపు పరిష్కరించాలని లేనట్లయితే గ్రామపంచాయతీ కార్యాలయం ముందు నిరవదిక ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, అఖిలపక్ష నాయకులు, పాల్గొన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

కనగల్ : మహిళలు ఇతరులపై ఆధారపడకుండా స్వయం శక్తితో ఎదగాలని అడిషనల్ డీఆర్‌డీఓ సరస్వతి అన్నారు. సోమవారం మండల పరిధిలోని జియడవల్లి గ్రామంలో ఓ మహిళ జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఫార్మ లైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజెస్ (పీఎంఎఫ్‌ఎంఈ) స్కీం ద్వారా పది లక్షల రుణం తీసుకుని ఏర్పాటు చేసిన బేకరీ, స్వీట్స్ షాపును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సరస్వతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డీపీఎం బెనర్జీ, ఏపీఎం నరహరి, సీసీలు ప్రభాకర్, వసంత, అంజయ్య, వీఓఏలు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే కిశోర్ బహిరంగ క్షమాపణ చెప్పాలి'

నల్లగొండ టౌన్ : దళిత బంధు విషయంలో ఎమ్మార్పీఎస్ నాయకులను అవమానపరిచిన తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ తక్షణమే మాదిగ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు బకరం శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ప్రధాన కార్యదర్శి పోతెపాక సాంబయ్య, ఆదిమల్ల శంకర్, బొజ్జ దేవయ్య, కురుపాటి కమలమ్మ, కందుల మోహన్, శంకర్‌రెడ్డి, ఇరుగు లక్ష్మయ్య, సత్యనారాయణ, పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మ తల్లి జాతర

నిడమనూరు : మండల కేంద్రంలో సోమవారం గగమ్మ తల్లి జాతర నిర్వహించారు. యాదవులు ప్రత్యేకంగా గంగమ్మ తల్లికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. జాతరకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కుందూరు జైవీర్‌రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమాలను యాదవ సంఘం నేతలు మన్నెం శంకర్, బొల్లం సైదులు, పిల్లి రాజు ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగాయి. గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని వీర్లపాలెం గ్రామంలో సోమవారం జరిగిన గంగమ్మ తల్లి జాతరలో ఎన్‌బీఆర్ ఫౌండేషన్ చైర్మన్ నల్లమోతు సిద్ధార్థ, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణరెడ్డిలు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నల్లమోతు సాంబశివరావు, వైస్ ఎంపీపీ సైదులురెడ్డి, నాయకులు కోట్యానాయక్, పార్వనాయక్, బైరం గోపి, వినోద్ నాయక్, కొండా లక్ష్మణ్, నాగరాజు, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం



పూజలు చేస్తున్న బీఎల్ఆర్

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ మండలం లావూడితండాలో సోమవారం శ్రీలింగ బసవేశ్వరాస్వామి, ఆంజనేయస్వామితో పాటు పలు దేవతామూర్తుల విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో మిర్యాలగూడ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బత్తుల లక్ష్మారెడ్డి ప్రత్యేక పూజలునిర్వహించారు. వేదపండితుల మంత్రోత్సవాల మధ్య స్వామివారికి పూజలు, అభిషేకాలను నిర్వహించారు. ఈ మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో లావుడితండలో పండుగ వాతవరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సర్పంచ్ అనుముల శ్రీనివాస్ రెడ్డి

త్రిపురారం : మండల కేంద్రానికి చెందిన మద్దెల పున్నమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. సోమవారం త్రిపురారం సర్పంచ్ అనుముల శ్రీనివాస్‌రెడ్డి రూ. 5వేలు కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయంగా అందజేశారు. అనంతరం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా కంపాసాగర్ గ్రామ పంచాయతీకి చెందిన అవిరెండ్ల శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు శ్రీను కుటుంబం పేదరికంలో ఉందని తెలుసుకొని అదే గ్రామానికి చెందిన కొండ భాస్కర్ రూ. 5 వేలు, 50 కేజీల బియ్యం అందజేశారు. అనంతరం శ్రీను చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అవిరెండ్ల మట్టయ్య, చింతకాయల యాదయ్య, అవిరెండ్ల రామకృష్ణ, మైధరి సైదులు, జానయ్య, బోజ్జ సోమయ్య, అవిరెండ్ల మహేష్, మధు, సైదులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ఆపదలో అండగా ఉంటాం

నిడమనూరు : కాంగ్రెస్ కార్యకర్తలకు ఆదపలో అండగా ఉంటామని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కుందూరు జైవీర్‌రెడ్డి సోమవారం అన్నారు. మండల కేంద్రానికి చెందిన పున్న మారయ్య ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. కుందూరు జయ్‌వీర్ రెడ్డి మారయ్య కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం కలిగి ఉండడంతో మంజూరైన రూ.2లక్షల బీమా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ నందికొండ రామేశ్వరి, కాంగ్రెస్ రాష్ట్ర యూత్ కార్యదర్శి యడవెల్లి వల్లభరెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు అంకతి సత్యం, శివ మారయ్య, విశ్వనాధుల రాణిరమేష్, సతీష్, పురుషోత్తంరెడ్డి, శంకర్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

త్రిపురారం : మండలంలోని నీలాయిగూడెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు కుందనపల్లి నర్సయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కుందూరు జైవీర్‌రెడ్డి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైవీర్‌రెడ్డి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్, హనుమయ్య, విజయ్, వెంకటయ్య, శ్రీను, సందీప్, లక్షణ్, సత్యనారాయణ, రవి, నర్సయ్య, లింగయ్య, చెన్నయ్య, పాల్గొన్నారు.

క్లుప్తంగా

26న మండల సర్వసభ్య సమావేశం

చింతపల్లి : ఈనెల 26న చింతపల్లి మండల పరిషత్ సర్వసభ్య మావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో నిర్వహించే సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

ఖాళీ స్థలాల్లో ఔషధ మొక్కలు పెంచుకోవాలి

హాలియా : ఇంటి ఖాళీ స్థలాల్లో ప్రతి ఒక్కరూ ఔషధ మొక్కలను పెంచుకోవాలని ఏసీడీపీఓ సువర్ణ, సూపర్ వైజర్ రమాదేవీ అన్నారు. మేరీ లైఫ్ కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ అనుముల ప్రాజెక్టు అధ్వర్యంలో సోమవారం అలీనగర్, పేరూర్, అనుముల-1 అంగన్‌వాడీ కేంద్రాల్లో నీటి పొదుపు, కిచెన్, టెర్రస్ గార్డెన్లపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. మహిళలు తమ ఇంటి ఖాళీ ప్రదేశాల్లో ఔషధ మొక్కలైన వేప, కరివేపాకు, పుదీనా, తులసి, గిలాయ్, అశ్వగంధ తదితర మొక్కలను పెంచుకోవాలని సూచించారు. నీటి వృథాను అరికట్టేందుకు కూరగాయలు కడిగిన నీటిని వృథా చేయకుండా ఖాళీ ప్రదేశాల్లో పెంచుకున్న మొక్కలకు పోసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏడబ్ల్యూటీ ఫర్జానా, మంజుల, పద్మ, ఏడబ్ల్యూహెచ్ మంగమ్మ, సోని తదితరులు ఉన్నారు.

అడవిదేవులపల్లి తహసీల్దార్‌గా దేశ్యానాయక్



అడవిదేవులపల్లి : అడవిదేవులపల్లి మండల తహసీల్దార్‌గా జి. దేశ్యానాయక్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. కట్టంగూరు మండల తహసీల్దార్‌గా పనిచేసిన దేశ్యానాయక్ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా మండల ఆయన మాట్లాడుతూ మండల ప్రజల రెవెన్యూ అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌కు కార్యాలయ ఉద్యోగులు పుష్పగుచ్చాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నయాబ్ తహసీల్దార్ రఘు, ఆర్ఐ ఠాగూర్ రామకృష్ణ, సినియర్ అసిస్టెంటు కోటేశ్వరీ, సర్వేయర్ లక్ష్మణ్, వీఆర్ఏలు పాల్గొన్నారు.

ట్రాక్టర్స్ యూనియన్ గ్రామ కమిటీ ఎన్నిక

మాడుగులపల్లి : మండలంలోని ఆగామోత్కూర్ గ్రామంలో సర్పంచ్ ఆగా అఫ్జల్ ఆధ్వర్యంలో ట్రాక్టర్స్ యూనియన్ కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భూపతి రవీందర్, ఉపాధ్యక్షుడిగా బంటు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు రమేష్, కార్యదర్శి బొల్లేపల్లి సైదులు, కోశాధికారిగా కోల సత్యం ఎన్నికయ్యారు.

రేపు బొడ్రాయి వార్షికోత్సవాలు

మాడుగులపల్లి: మండలంలోని పాములపాడు గ్రామంలో ఈ నెల 24న బొడ్రాయి ద్వితీయ వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు సామాజిక కార్యకర్త ఏర్పుల వెంకటయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం బొడ్రాయి వద్ద వేదపండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి పాలాభిషేకం, జలాభిషేకం నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ఆడపడుచులు బోనాలతో ఊరేగింపుగా వచ్చి దుర్గామాతకు నైవేద్యం సమర్పించనున్నట్లు తెలిపారు.

ఆశ వర్కర్లకు పరీక్ష రద్దు చేయాలి

మిర్యాలగూడ అర్బన్: ఆశ వర్కర్లకు పరీక్షను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా నాయకులు మల్లు గౌతంరెడ్డి అన్నారు. సోమవారం ఆశలతో కలిసి ప్రకాశ్‌నగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న లక్ష్మికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లా డుతూ ఆశల సమస్యలను పరిష్కరించి పని భారం తగ్గించాలని కోరారు. ఆయన వెంట ఆశ వర్కర్లు రామలక్ష్మి, అమృత లక్ష్మి, ప్రవీణ, సరస్వతి, రమాదేవి, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై ఫిర్యాదు

చందంపేట : మండలంలోని పోలేపల్లి వద్ద ఏర్పాటు చేసిన చిత్రియాల పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం డీఎస్ఓకు ఫిర్యాదు చేసినట్లు గుంటిపల్లి గ్రామ సర్పంచ్ మాధవరం శంకర్‌రావు తెలిపారు. ఇక్కడ అధికారులు హమాలీలతో మధ్యవర్తులుగా పెట్టుకొని బ్రోకర్లకు అనుకూలంగా పని చేస్తూ రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని పేర్కొన్నారు. ఇక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రానికి బ్రోకర్లు ఎప్పుడూ ధాన్యాన్ని తీసుకొచ్చినా లాటుకు రూ.500 నుంచి రూ.2వేల వరకు వసూలు చేసి ముందు వరుస క్రమంలో ఉన్న రైతుల కంటే ముందుగా వారి ధాన్యాన్ని లోడింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం నిర్ణయించిన హమాలీ రేటు కంటే అధికంగా డిమాండ్ చేస్తున్నారని తెలిపారు.